
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



ఒత్తిడి నుంచి ఉపశమనానికి..

ఒత్తిడి నుంచి బయటపడేందుకు వ్యాయామంతో పాటు మొబిలైజేషన్ ఉపకరిస్తుందని సీపీ శ్రీకాంత్ తెలిపారు. 8లో



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కేకే లైన్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 9లో



క్రమశిక్షణతో ఉజ్వల భవిత

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిసాయి. విజేతలకు సీపీ బహుమతులు అందజేశారు. 8లో

‘పబ్లిక్’గా మాయ!

- ధర ఖరారులో వింతలు
- పారల కొనుగోలులో అవినీతి
- అంచనాల్లోనే అక్రమాలు
- జీవీఎంసీలో చక్రం తిప్పుతున్న ఉద్యోగి?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య నిర్వహణ టెండర్లలో అవినీతి కంపు కొడుతోంది. మురుగు కాలువలను శుభ్రం చేసేందుకు ఉపయోగించే పారల కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ సైజు కలిగిన పారలకు అధిక ధర.. ఎక్కువ సైజు ఉన్న పారలకు తక్కువ ధరలను నిర్ణయిస్తూ టెండర్లను ఖరారు చేసిన వ్యవహారంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వివిధ పరికరాల కొనుగోలు కోసం జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం పిలిచిన టెండర్ల వ్యవహారంలో అధిక అంచనాలు వేసి అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై మేయర్, కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు రెండుసార్లు రీ–టెండర్ నిర్వహించేలా చేశారు. ఈ వ్యవహారం అక్కడితో ఆగిపోలేదు. తాజాగా అంచనాలను రూపొందించడంలో పబ్లిక్ హెల్త్ విభాగం వ్యవహరించిన తీరు ముక్కున వేలు వేసుకునేలా చేస్తోంది. ఇందులో పబ్లిక్ హెల్త్ విభాగం ఉద్యోగి ఒకరు చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. గతంలో వేరే జోన్‌లో పనిచేసి, ప్రధాన కార్యాలయానికి వచ్చిన తర్వాత మరింత చురుగ్గా అవినీతికి పావులు కదుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అంచనాల్లోనే అవినీతి కంపు

జీవీఎంసీ పరిధిలో మురుగు కాలువలను శుభ్రం చేసేందుకు ఇనుప పారలను ఉపయోగిస్తారు. వెదురు కర్రలకు ఈ ఇనుప పారలను బిగిస్తారు. ఇందుకోసం రెండు రకాల పారలను కొనుగోలు చేసేందుకు జీవీఎంసీ తాజాగా టెండర్లను ఖరారు చేసింది. వీటి ధరలను మొదటగా జీవీఎంసీ నిర్ణయించి.. అంత కంటే తక్కువ ధరను కోట్ చేసిన సంస్థలకు పనులు అప్పగిస్తుంది. ఈ వ్యవహారంలోనే అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 30 సెంటీమీటర్ల పొడవు, 16 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన పారలకు 25 నుంచి 30 ఎంఎం డయా, 5 అడుగుల వెదురు కర్ర బిగించాలని పేర్కొన్నారు. దీని ధర రూ.180గా నిర్ణయించారు. అంతిమంగా టెండర్‌లో రూ.154.24గా ఖరారైంది. ఇందుకు అనుగుణంగా కాంట్రాక్టర్‌కు పని అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇందుకోసం రూ.15.42 లక్షలను జీవీఎంసీ కేటాయించింది. అంతకు ముందు 10 సెంటీమీటర్ల వెడల్పు, 20 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన అవే పారల ధరను రూ.200గా నిర్ణయించారు. అంటే 30–16 సెం.మీల పార ధర రూ.180గా నిర్ణయించిన అధికారులు.. 20–10 సెం.మీ పార ధరను మాత్రం రూ.200గా నిర్ణయించారు. వాస్తవానికి దీని ధర చాలా తక్కువగా నిర్ణయించాలి. రమారమీ ఈ పార ధర రూ.100 నుంచి రూ.120 మేర ఉంటుంది. అధికారులు మాత్రం సుమారు 100 శాతం అధిక ధరగా అంచనా వేశారు. ఈ వ్యవహారంలో అధికారుల తీరు స్పష్టం అవుతోంది.

అన్నింటిలోనూ ఇలాగే..!

ఈ మధ్యకాలంలో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం అవసరాలకు అనుగుణంగా వివిధ పరికరాల కొనుగోలు కోసం వేసిన అంచనాలన్నింటిలోనూ ఇదే తంతు నడిచిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్లీచింగ్ పౌడర్ మొదలుకుని పారిశుధ్య కార్మికులు ధరించే చేతి గ్లౌజుల వరకు ఇదే వ్యవహారం నడిచినట్టు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే కమిషనర్ దృష్టి సారించి ఒకే టెండర్‌కు రెండు సార్లు రివర్స్ టెండర్‌ను పిలిపించి కొంత మేర అవినీతిని అడ్డుకట్ట వేసినట్టు తెలుస్తోంది. అలాగే ఆయా సామగ్రి సరఫరా సమయాన్ని నెల రోజులు కాకుండా 10 రోజుల్లోనే సరఫరా చేయాలని సవరణ చేస్తూ.. అర్ధాంతరంగా టెండరులో మార్పులు చేశారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. తాజాగా జరిగిన టెండర్ వ్యవహారంపై ఉన్నతాధికారులు లోతుగా దృష్టి సారిస్తే.. దీని వెనుక లోగుట్టు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సీనియర్ జట్టులో చోటే లక్ష్యం

- మహిళా క్రికెటర్ మహమ్మద్ షబ్నం
- విమానాశ్రయంలో ఘన స్వాగతం



షబ్నంకు స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు



మెడల్‌ను చూపిస్తున్న షబ్నం

గోపాలపట్నం/మర్రిపాలెం: మహిళల అండర్–19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ విజేత భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించిన మహమ్మద్ షబ్నం గురువారం విశాఖకు చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత విశాఖ రావడం ఇదే తొలిసారి. షబ్నంను ఆమె తల్లిదండ్రులు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఆనంద భరితులయ్యారు. తండ్రి షకీల్ ఆమెకు స్వీట్ అందించి గెలుపు మాధుర్యాన్ని ఆస్వాదించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మొల్లి చిన్నయాదవ్, అతని అనుచరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ఆమె మర్రిపాలెంలోని స్వగృహానికి వెళ్లారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

తన తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ స్థాయికి తీసుకెళ్లిందని షబ్నం తెలిపింది. విశాఖ విమానాశ్రయంలో ఆమె తన ఆనందాన్ని మీడియాతో పంచుకుంది. ‘వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యురాలిని కావడం గర్వంగా ఉంది. ఇది నా జీవితంలో మరపురాని సంఘటన. బీసీసీఐ చాలా ప్రోత్సహించింది. దీన్ని ఓ మెట్టుగా భావించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తా. కష్టపడితే తగిన ఫలితం దక్కుతుందని నమ్మాను. అందుకు ఈ విజయమే నిదర్శనం. సీనియర్ మహిళా జట్టులో ఆడటమే నా లక్ష్యం. అందుకు ఈ విజయం ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచకప్‌లో ఆటడం వల్ల చాలా విషయాలు తెలుసుకున్నా.. దక్షిణాఫ్రికా టూర్ ఎంతగానో ఉపయోగపడింది. అక్కడి వాతావరణం, పిచ్ స్వభావం వంటి వాటికి అలవాటు పడ్డాం. ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైన తర్వాత 8 నెలలు కోచ్‌ల ఆధ్వర్యంలో తర్ఫీదు పొందాం. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ వంటి సీనియర్ క్రికెటర్లతో అహ్మదాబాద్‌లో భారత్– న్యూజిలాండ్ మ్యాచ్ తిలకించడం ఎంతో సంతోషంగా ఉంది.’ అని షబ్నం తెలిపింది. కాగా.. డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా వెళ్లిన అండర్–19 భారత మహిళల జట్టు 6 టీ–20, వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఈ సిరీస్‌లో షబ్నం రెండు మ్యాచ్‌ల్లో ఆడగా.. ఓ మ్యాచ్‌లో మూడు, మరో మ్యాచ్‌లో ఓ వికెట్ సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా, యూఏఈతో జరిగిన మ్యాచ్‌ల్లో షబ్నం ఆడింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఓ వికెట్ సొంతం చేసుకుంది.

న్యూస్‌రీల్

సీఎం జగన్‌ను కలిసిన శ్రీధర్‌రెడ్డి



దొండపర్తి(విశాఖ దక్షిణ): స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్స్ సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని సీఎంవోలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న జాబ్‌మేళాలపై ముఖ్యమంత్రికి వివరించారు.

అప్పన్నను దర్శించుకున్న గోవా ముఖ్యమంత్రి



ప్రమోద్ సావంత్‌కి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని మొక్కుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు అంజేశారు. గోవా పర్యాటకశాఖ మంత్రి రోహన్ కాంతే కూడా ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

మీనాక్షికి కలెక్టర్ అభినందన



సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఉమెన్ ఫిడే మాస్టర్ టైటిల్ సాధించిన చదరంగం క్రీడాకారిణి కోలగట్ల ఆలన మీనాక్షిని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అభినందించారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మీనాక్షి బాల పురస్కార్–2023 అవార్డును అందుకుంది. గురువారం మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలవగా మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.మల్లికార్జున మీనాక్షిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.సూర్యారావు, ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు, కోచ్ చిరంజీవి, చెస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో తొలిసారిగా 100 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయి. మార్చి 28,29 తేదీల్లో జరగనున్న జీ–20 సమ్మిట్ నేపథ్యంలో నగర సుందరీకరణ సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదించనున్నారు. వివిధ రహదారుల్లో లైన్ మార్కింగ్, స్టడ్లు ఏర్పాట్లు, ఫుట్‌పాత్, డివైడర్ల మరమ్మతులు, ఫ్లైఓవర్ కాలమ్స్ పెయింటింగ్, ట్రీ ప్లాంటేషన్ తదితర అంశాలు పరిపాలన ఆమోదానికి చర్చకు రానున్నాయి. సొరశక్తి సహాయంతో టాయిలెట్ బ్లాక్, బీచ్ లాన్లలో సోలార్ చెట్లు, అవుట్‌డోర్ సీటింగ్‌కు పారామెట్రిక్ వేవ్ బెంచ్ ఏర్పాటు, సెంటర్ మీడియన్లలో ఎల్ఈడీ స్క్రీన్ పోల్స్ తదితరవి ఏర్పాటుపై చర్చ సాగనుంది. ప్రధాని మోదీ విశాఖ విచ్చేసిన సందర్భంగా వీవీపీల సందర్శనాల ఏర్పాట్లకైన వ్యయం మంజూరు, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో అద్దె ప్రాతిపదికన పొక్లెయిన్లు, టిప్పర్లు ఏర్పాటు చేసి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించినందుకైన వ్యయాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించడం, నగరంలోని వివిధ శ్మశాన వాటిక అభివృద్ధి, తదితర 100 అంశాలపై చర్చ సాగనుంది.

విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, పరిశీలకుడు సూర్యనారాయణ తదితరులు

మేయర్ గొలగాని హరివెంకటకుమారి

బీచ్‌రోడ్డు: విశాఖ పరిపాలన రాజధానిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. విశాఖ త్వరలోనే కార్యనిర్వాహక రాజధాని కాబోతోందని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తూ.. వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తారన్న నమ్మకం అందరిలోనూ ఉందన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ రాజధాని కావడం వల్ల ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయన్నారు. రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాష్ట్ర బీసీ సంఘ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం బీసీ సంఘం నగర అధ్యక్షురాలు సత్యాల సాగరిక ఆధ్వర్యంలో క్షీరాభిషేకం జరిగింది. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, రవిరెడ్డి, మహిళా నాయకురాలు రమణి, అల్లంపల్లి రాజాబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



శిల్పారామంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, తదితరులు

పరిశుభ్రతకే అధిక ప్రాధాన్యం

- పారిశుధ్య పనులపై దృష్టిసారించాలి
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు





మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు, పాల్గొన్న పారిశుధ్య విభాగ అధికారులు, వార్డు శానిటరీ కార్యదర్శులు

డాబాగార్డెన్స్: అతిథులకు ఆహ్లాదం, పరిశుభ్రత కల్పించాల్సిన బాధ్యత మనదేనని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో గురువారం జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, వార్డు శానిటరీ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ–20 సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. పరిశుభ్ర నగరాల్లో 4వ స్థానం దక్కించుకున్న విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వార్డు కార్యదర్శులంతా పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలను కలుపుకొని సామాజిక కార్యక్రమాలు నిత్యం చేపట్టాలన్నారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్–2023 అంశాల దృష్ట్యా విశాఖ నగరం ప్రథమ స్థానం సాధన దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు వచ్చే క్లాప్ వాహనాల నిర్వహణ కోసం యూజర్ చార్జీల సొమ్మును వినియోగించడం జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. నగర పరిధిలో 325 ప్రజా మరుగుదొడ్లు ఉన్నాయని, వాటిని నిత్యం శుభ్రం చేయించి ప్రజల వినియోగానికి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నుంచి శానిటరీ కార్యదర్శి వరకు ప్రతి ఒక్కరూ యూనిఫాం, ఐడీ కార్డు ధరించాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో చెత్త తరలింపు ప్రక్రియకు అధిక సంఖ్యలో పారిశుధ్య కార్మికులు అవసరమని.. గోడలకు వేసే రంగులపై కొంత మంది గోడపత్రికల ప్రకటనలు అతికిస్తున్నారని వాటిని నిరోధించాల్సిన అవసరం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

త్వరితగతిన టిడ్కో ఇళ్ల నిర్మాణం

- ఏప్రిల్‌లో లబ్ధిదారులకు అందించాలి
- టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

దొండపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యం మేరకు రాష్ట్రంలో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇంజినీరింగ్, జీవీఎంసీ యూసీడీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో టిడ్కో గృహాల పనులపై అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 6,728, విజయనగరంలో 4,224, శ్రీకాకుళంలో 2,720 మొత్తంగా 13,672 గృహాలను ఏప్రిల్ 23వ తేదీ నాటికి అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టులలో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాజెక్టు ప్రాంతాల్లోను మురుగునీటి శుద్ధి, రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్ ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు రుణాలు మంజూరు అందించే విషయంలో యూసీడీ, మెప్మా శాఖల అధికారులు, టిడ్కో అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఏపీ టిడ్కో హౌసింగ్‌పై లబ్ధిదారులకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేకంగా ఏపీ టిడ్కో యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులతో చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయించి హౌసింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. గత నాలుగు నెలల్లో విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో 50 వేల గృహాలు అందించినట్లు వెల్లడించారు. సమావేశంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.శ్రీరామ్మూర్తి, యూసీడీ పీడీ పాపునాయుడు, ఈఈలు సుధాకర్, జ్యోతి, డీఈఈ బాలకృష్ణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ స్పెషలిస్ట్ అశ్విని, మూడు జిల్లాల సీఎల్‌టీసీ సభ్యులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో యువతకు ఉజ్వల భవిత


జూనియర్స్ విభాగంలో రన్నర్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు


జూనియర్స్ విభాగంలో విన్నర్స్ సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు


సీనియర్స్ విభాగంలో రన్నర్స్ దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


సీనియర్స్ విభాగంలో విన్నర్స్ ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు

- శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమంలో సీపీ శ్రీకాంత్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో విజేతలకు ట్రోఫీల అందజేత

దొండపర్తి (విశాఖ దక్షిణ): యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించడం ద్వారా క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో గురువారం జరిగిన 'సాక్షి ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే... ఆటలు శారీరక దృఢత్వం, ఏకాగ్రత, నాయకత్వం, ఆత్మవిశ్వాసం, నీతి, విలువలు వంటి జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భౌతిక ప్రయోజనాలతోపాటు సామాజిక, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయన్నారు. 'సాక్షి ప్రీమియర్ లీగ్' ద్వారా జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కాలేజీల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌ను అభినందించారు. వీడీసీఏ అంపైర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాలను సాధించడానికే కాకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

విజేతలకు సీపీ శ్రీకాంత్ ట్రోఫీల ప్రదానం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ టోర్నమెంట్‌లో జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) విన్నర్‌గా నిలవగా... ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్(కంచరపాలెం) రన్నరప్‌గా నిలిచింది. అలాగే సీనియర్స్ విభాగంలో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) ట్రోఫీని కైవసం చేసుకుంది. దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. విన్నర్, రన్నర్ జట్లకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం శ్రీనివాస్, సాక్షి ఛానల్ విశాఖ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.

విజేతగా సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్

జూనియర్స్ విభాగంలో ఉదయం జరిగిన ఫైనల్స్ పోరులో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) 27 పరుగుల తేడాతో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల (కంచరపాలెం)పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సాయి గణపతి పాలిటెక్నికల్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. తనిష్క్ 20 బంతుల్లో 2 ఫోర్లతో 28 పరుగులు, నూకేష్ 17 పరుగులు చేశారు. 73 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు 46 పరుగులకే కుప్పకూలిపోయింది. దుర్గ 15, గణేష్ 11 పరుగులు చేశారు. కుమార్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అలాగే లోకేష్ 2, తేజ 1 వికెట్ తీశారు.

ట్రోఫీ గెలుచుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ

సీనియర్స్ విభాగంలో మధ్యాహ్నం జరిగిన ఫైనల్స్‌లో దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్టుపై 24 పరుగుల తేడాతో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 91 పరుగుల భారీ స్కోరు చేసింది. సీహెచ్.మోహన్ వాసుకిరణ్ 24 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో 46 పరుగులు, ఎల్.తేజ్‌తరుణ్ 2 సిక్సులతో 20, వి.సునీల్ 2 ఫోర్లతో 13 పరుగులు చేశారు. అనంతరం 91 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి కేవలం 67 పరుగులు మాత్రమే చేయగలిగింది. చైతన్య 20, కుమార్ 17, కె.ప్రసాద్ 12 పరుగులు చేశారు. జి.సాయికుమార్ 2, వి.మణివరప్రసాద్ 2, సి.హెచ్.మోహన్ వాసుకిరణ్ 1 వికెట్ తీశారు.

పీజీ విద్యార్థిని ఆత్మహత్య


మాధురి

మద్దిలపాలెం: జ్ఞానాపురం వద్ద ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాలలో పీజీ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన నున్న మాధురి(21) సెయింట్ జోసెఫ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ పీజీ చదువుతోంది. గత నెల 31న పుట్టినరోజు కావడంతో రెండు రోజుల ముందు అంటే జనవరి 29న సొంత ఊరు వెళ్లింది. బుధవారం కళాశాలకు తిరిగి వచ్చినట్టు సిబ్బంది చెబుతున్నారు. అయితే గురువారం ఉదయం మాధురి తరగతులకు హాజరు కాకపోవడంతో తోటి విద్యార్థిని ఆమె కోసం హాస్టల్ గది వద్దకు వెళ్లింది. మాధురి ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించి కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. తోటి విద్యార్థులతో కలిసి ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్టు వారు గుర్తించారు. దీంతో కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ దివ్య భారతి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ లభ్యం

సచివాలయం మహిళా పోలీస్ పనితీరుకు ప్రశంసలు


తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మహిళా పోలీస్

మధురవాడ: తప్పిపోయిన బాలుడి ఆచూకీని గంటల వ్యవధిలోనే మహిళా పోలీస్ కనుగొని.. ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలివీ.. మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం రాజీవ్ గృహకల్ప కాలనీ 52వ బ్లాక్‌లో దూసి పోలయ్య, రాములమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు హేమంత్‌కుమార్ కాలనీలోని ఎంఈపీ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం మూడు గంటలకు పాఠశాల విడిచి పెట్టగా.. బాలుడు ఇంటికి చేరలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు కాలనీ అంతా వెతికారు. ఎక్కడా కనిపించ లేదు. తెలిసిన వారికి ఫోన్లు చేసినా ప్రయోజనం లేక పోయింది. దీంతో 78వ సచివాలయం మహిళా పోలీస్ సీహెచ్ లీలకు తల్లి రాములమ్మ ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన మహిళా పోలీస్ ఇతర సచివాలయాలకు కూడా సమాచారం ఇచ్చారు. సాయంత్రం 8 గంటల ప్రాంతంలో హైవేపై బాలుడిని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. మహిళా పోలీస్‌కు బాలుడి తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు.

సంజీవిని రిలీఫ్ ఫండ్‌కు విశాఖ వేలీ విరాళం



ఆరిలోవ: సంజీవిని జిల్లా రిలీఫ్ ఫండ్ కోసం విశాఖ వేలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ రూ. లక్ష విరాళం ప్రకటించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మల్లికార్జునను కలిసి చెక్కు అందజేశారు.

సేవలతో వేడుకలు


స్వామి వివేకానంద సంస్థలో పారిశుధ్య కార్మికులకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరాలు, అన్నసమారాధనలు, వస్త్ర దానాలు చేశారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే వాసుపల్లి చీరలు పంపిణీ చేశారు.

ఒత్తిడి నుంచి ఉపశమనానికి మొబిలైజేషన్

దొండపర్తి(విశాఖ దక్షిణ): సిబ్బంది ఒత్తిడి నుంచి బయటపడేందుకు వ్యాయామంతో పాటు మొబిలైజేషన్ ఎంతగానో ఉపకరిస్తుందని సీపీ సిహెచ్.శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది, అధికారులకు సూచించారు. గురువారం ఏఆర్ మైదానంలో జరిగిన డీ మొబిలైజేషన్ సెర్మోనియల్ పరేడ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరేడ్‌లో ఎటువంటి తప్పులు లేకుండా బాగా చేశారని అభినందించారు. అంతర్జాతీయ సదస్సులు జరగనున్న నేపథ్యంలో నగరానికి అనేక మంది వీఐపీలు వస్తూ, వెళుతుంటారని, వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతి కుమార్, ఎ.రాఘవేంద్రరావు, ఆర్ఐ(అడ్మిన్) బి.సీతారాం పాల్గొన్నారు.

'ప్రతిభ'కు పట్టం!

- 5న ఎన్ఎంఎంఎస్ ఎంట్రన్స్
- జిల్లాలో 2,080 మంది దరఖాస్తు

విశాఖ విద్య: జాతీయ ప్రతిభాన్వేషణ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) అర్హత పరీక్షలో సత్తా చాటేందుకు విద్యార్థులు సన్నద్ధమౌతున్నారు. ఈ ఏడాది విశాఖ జిల్లాలో 2,080 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది అర్హత సాధించేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షపై శిక్షణ ఇచ్చేలా డీఈవో ఎల్.చంద్రకళ పాఠశాలల ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.

పరీక్షకు ఏర్పాట్లు :పరీక్ష ఈ నెల 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. పరీక్ష నిర్వహణ కోసం విశాఖ నగరంలో 7, భీమిలిలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. వెబ్‌సైట్‌లో ఉన్న హాల్ టిక్కెట్లను పాఠశాల యూ-డైస్ కోడ్‌తో డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయులను డీఈవో ఆదేశించారు.

పోలీస్ అధికారి కారు బీభత్సం

బీచ్‌రోడ్డు: ఓ పోలీస్ ఉన్నతాధికారి కారు బుధవారం రాత్రి సాగరతీరంలో బీభత్సం చేసింది. కుటుంబసమేతంగా తీరానికి వచ్చిన ఆ అధికారి కారు వేరొక సందర్శకుల కారును ఢీకొట్టింది. ఈ ఘటన మొత్తం వీడియో తీసిన సందర్శకులు గురువారం సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయితే ఈ ప్రమాదంపై స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

మహిళ వాట్సాప్‌ను హ్యాక్ చేసిన వ్యక్తి అరెస్ట్

దొండపర్తి(విశాఖ దక్షిణ): మహిళ వాట్సాప్ క్యూఆర్ కోడ్ ద్వారా వాట్సాప్ అకౌంట్‌ను గుప్పెట్లోకి తీసుకొని ఆమె కుటుంబ సభ్యులకే అసభ్యకరమైన ఫొటోలు, మెసేజ్‌లు పంపించిన వ్యక్తిని సైబర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన అవివాహిత వాట్సాప్ అకౌంట్ నుంచి ఆమె తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యుల వాట్సాప్ గ్రూప్‌లో అసభ్యకరమైన ఫొటోలు, మెసేజ్‌లు వచ్చాయి. దీంతో అటువంటి ఫొటోలు, మెసేజ్‌లు ఎందుకు పెడుతున్నావని ఆమె కుటుంబ సభ్యులు అడగగా.. ఆమె షాక్‌కు గురైంది. తాను ఎటువంటి పోస్టులు పెట్టలేదని, వాట్సాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవాని ప్రసాద్ ఆ మెసేజ్‌లు చేసింది పెందుర్తి మండలం గుత్తాడ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్‌గా గుర్తించారు. అతడు మహిళకు క్లాస్‌మేట్‌తో పాటు స్నేహితుడని తెలుసుకున్నారు. ఆమెను మాటల్లో పెట్టి ఆమె మొబైల్‌లో వాట్సాప్ అకౌంట్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అకౌంట్‌ను తన గుప్పెట్లోకి తీసుకొని అసభ్యకర రీతిలో మెసేజ్‌లు చేశాడు. దీంతో వినయ్‌కుమార్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.